# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-02-2026** **సమయం : 2.40 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు లోక్ సభలో ప్రవేశపెట్టారు.**

2. **ఆంధ్రప్రదేశ్ సహా ఖనిజ వనరులున్న రాష్ట్రాల కోసం ప్రత్యేక మైనింగ్ మిషన్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు.**

3. **ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి రానుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.**

4. **క్యాన్సర్ నివారణలో ముందస్తు పరీక్షలు, అవగాహన, సమయానుగుణ చికిత్సే కీలకమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

5. **విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

==========================

2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ఆమె బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంతకుముందు ఆమె రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి, బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అనుమతి తీసుకుని పార్లమెంట్‌కు చేరుకున్నారు. అక్కడ కేంద్ర మంత్రివర్గం సమావేశమై బడ్జెట్ కు ఆమోదం తెలిపింది. అనంతరం వార్షిక బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా సాగుతోందని చెప్పారు. ప్రపంచ మార్కెట్లతో భారత్‌ను అనుసంధానిస్తున్నామని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోకసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. దేశ ప్రజల ఆకాంక్షలను ఈ బడ్జెట్ ప్రతిబింబించిందని తెలిపారు. వికసిత్ భారత్

నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

వార్షిక కేంద్ర బడ్జెట్‌లో భాగంగా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేయనున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ముంబయి–పుణె, పుణె–హైదరాబాద్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, ఢిల్లీ–వారణాసి, వారణాసి–సిలిగుడి, చెన్నై–బెంగళూరుల మధ్య ఏడు కారిడార్ల మౌలిక సదుపాయాల కల్పనకు 12.2 లక్షల కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అరుదైన భూ ఖనిజాల కోసం ఆంధ్రప్రదేశ్ సహా ఒడిశా, కేరళ, తమిళనాడు 4 రాష్ట్రాలతో ప్రత్యేక మైనింగ్ మిషన్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రివెల్లడిస్తూ....

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి రానుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వార్షిక కేంద్ర బడ్జెట్ లో భాగంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, పన్ను రిటర్నుల దాఖలు గడువును డిసెంబర్ 31 నుంచి మార్చి 31 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యంపై టీడీఎస్ 5శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నామని చెప్పారు. సామాన్యులు సైతం ఐటిఆర్‌ను నమోదు చేసేలా సరళతరం చేసిన ఫారాలు త్వరలో అందుబాటులోకి తెస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

లోక్ సభలో ప్రవేశ పెట్టిన 2026–27 కేంద్ర వార్షిక బడ్జెట్ సామాన్యుల నుంచి వ్యాపారుల వరకు అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ ప్రతినిధి కె.అశోక్ తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

క్యాన్సర్ నివారణలో ముందస్తు పరీక్షలు, అవగాహన, సమయానుగుణ చికిత్సే కీలకమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో "గుడ్ మార్నింగ్ వైజాగ్ – – గుడ్ బై క్యాన్సర్" అనే నినాదంతో బీచ్ రోడ్డులో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన వాక్‌థాన్‌ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ ను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్‌సిడి–4.0 కార్యక్రమం కింద, అవసరమైన వారికి ప్రాథమిక స్థాయిలోనే ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు చర్చ్ పేటలోని డా. బీ.ఆర్. అంబేద్కర్ పురపాలక పాఠశాలను మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, బోధనా పద్ధతులు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి, సౌకర్యవంతమైన అభ్యాసానికి అవసరమైన భవనాలు, తరగతి గదులు, గ్రంథాలయాలు క్రీడా మైదానాలు పరిశుభ్రమైన తాగునీరు సౌచాలయాలు వంటి ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

అమరావతిలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల అధ్యయనానికి రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ విదేశాల్లో పర్యటించనున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్డమ్–యూకే, ఖతార్ దేశాల్లో పర్యటిస్తారు. రేపు, ఎల్లుండి లండన్‌లో ఈ నెల 4,5 తేదీల్లో దోహాలో మంత్రివర్గ బృందం పర్యటించనుంది. ఇందులో భాగంగా అమరావతిలో పర్యాటక ప్రాజెక్టులు, నదీతీర అభివృద్ధి, అంతర్జాతీయ క్రీడా నగరం నిర్మాణం కోసం పలు ప్రాంతాలను మంత్రి నారాయణ బృందం పరిశీలించనుందని అధికారులు తెలిపారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లా విజ్జేశ్వరం నరసాపురం ప్రధాన కాలువ కింద రబీ పంటకు వంతుల వారీగా సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ రోజు నుంచి ఈ నెల 7వ తేదీ ఉదయం 6 గంటల వరకు తొలి విడతగా సాగునీటిని సరఫరా చేయనున్నారు. అలాగే ఈనెల 14వ తేదీ నుంచి రెండవ విడతలో కాలువ ఆయకట్టుకు వంతుల వారీగా నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. మార్టేరు నీటిపారుదల విభాగం పరిధిలోని పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు, పాలకొల్లు, ఇరగవరం మండలాల్లో రబీ పంట సాగుకు ఈ నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. దీనిని రైతులు దృష్టిలో ఉంచుకుని సాగు పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు.

======================